## ప్రాజెక్టులను అడ్డుకున్న అధికారికి అందలమా?

మొదటిపేజీ తరువాయి...

తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, ఆదిత్యనాథ్ దాస్ నియామకాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఆదిత్యదాస్‌నాథ్‌ను తొలగించాలి: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి**

తెలంగాణ నీటి పారుదలశాఖ సలహాదారు పదవి నుంచి ఆదిత్యనాథ్‌దాస్‌ను ప్రభుత్వం వెంటనే తొలగించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశానుసారం, ఆయన శిష్యుడు సీఎం రేవంత్ నడుచుకుంటున్నారని అందులో భాగంగానే ఆదిత్యనాథ్ దాస్ నియామకం జరిగిందని ఆరోపించారు. తెలంగాణపై చంద్రబాబు కర్రపెత్తనం మొదలైందనడానికి ఈ నియామకమే నిదర్శనమని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి తెలంగాణకు రుణపడి ఉంటాడా? లేక చంద్రబాబు ఆదేశాల మేరకు నడుచుకుంటారా? అని నిలదీశారు. జలయజ్ఞం ప్రాజెక్టులు, పాలమూరు రంగారెడ్డిపై కేసులు వేసి పనులు ఆపిన వ్యవహారంలో ఆదిత్యనాథ్‌ది కీలకపాత్రని తెలిపారు. అటువంటి వ్యక్తికి తెలంగాణ నీటి పారుదలశాఖ సలహాదారు పదవి ఎందుకు కట్టబెట్టారో ప్రభుత్వం వివరణనివ్వాలని డిమాండ్ చేశారు. ఏ ప్రయోజనాల కోసం ఈ పదవిలో కూర్చోబెట్టారని నిలదీశారు. వ్యక్తిగతంగా ఒక ప్రభుత్వ అధికారిగా ఆయనపై తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని స్పష్టం చేశారు. అయితే ఆంధ్రాకు కృష్ణా ప్రాజెక్టుల నుంచి నీటిని తరలించడంలో కీలకపాత్ర పోషించిన, గత పదేండ్లుగా తెలంగాణకు వ్యతిరేకంగా ఏపీ తరపున కొట్లాడిన వ్యక్తి.. ఇప్పుడు తెలంగాణకు న్యాయం చేస్తారా? అని నిలదీశారు. కేఆర్ఎంబీలో తెలంగాణ వాదనను తొక్కిపట్టి ప్రాజెక్టుల మీద హక్కులు కోల్పోయేలా చేసిన వ్యక్తిని నియమించడంలో కాంగ్రెస్ ఆలోచన ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో పాలమూరు మరోసారి ఎడారి అయ్యేలా ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆదిత్యనాథ్‌ను సలహాదారు పదవి నుండి తొలగించాలని నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# ఎంపీ సీట్లు తక్కువెందుకొచ్చినయ్?

- 12 సీట్లు కదా.. ఆశించాం!
- తెలంగాణపై నమ్మకం పెట్టుకున్నం
- ఫలితాలతో నిరాశ చెందాం
- తెలంగాణ ఎంపీ రిజల్ట్స్‌పై సీఎం రేవంత్‌తో సోనియా
- కాంగ్రెస్ అధినేత్రితో సీఎం భేటీ
- ఎంపీ ఫలితాలు, పార్టీ, ప్రభుత్వ పనితీరుపై వివరణ

హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో పార్టీకి వచ్చిన ఎంపీ ఫలితాలు నిరాశ కలిగించాయని సీఎం రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ అన్నట్టు తెలిసింది. సుమారు 12 సీట్లు ఆశించగా అంత తక్కువ ఎందుకొచ్చాయని అడిగినట్టు సమాచారం. ఈ మేరకు శనివారం ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ అగ్రనేత సోనియా గాంధీతో భేటీ అయ్యారు. ఆ తర్వాత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతోనూ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎంపీ ఫలితాలు, పార్టీ, ప్రభుత్వ పరిస్థితిపై వీరికి వివరణ ఇచ్చినట్టు తెలిసింది. అదేవిధంగా క్యాబినెట్ విస్తరణ, కొత్త పీసీసీ అధ్యక్షుడి ఎంపికపైనా సోనియాతో చర్చ జరిగినట్టు సమాచారం. ఈ భేటీ సందర్భంగా పలు అంశాలపై సోనియా ఆరా తీసినట్టు తెలిసింది. ముఖ్యంగా ఎంపీ ఫలితాలపై అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. ప్రభుత్వంలో ఉంటూ బీజేపీతో సమానంగా సీట్లు రావడం ఏమిటి? అని ప్రశ్నించారని తెలిసింది. ఎక్కడ లోపం జరిగిందని, కారణం ఏమిటని అడిగినట్టు సమాచారం. ఉత్తరాదితో కాంగ్రెస్ మంచి ఫలితాలు సాధిస్తే.. ఎంతో నమ్మకం పెట్టుకున్న తెలంగాణ, కర్ణాటకల్లో మాత్రం పార్టీకి ఆశించిన ఫలితాలు రాలేదని అన్నట్టు తెలిసింది.



**క్యాబినెట్ విస్తరణ.. కొత్త పీసీసీ చీఫ్‌పై చర్చ**

ఈ భేటీ సందర్భంగా క్యాబినెట్ విస్తరణపై సోనియా-రేవంత్ మధ్య చర్చ జరిగినట్టు తెలిసింది. మరో ఆరుగురికి అవకాశం ఉన్నదని సీఎం రేవంత్‌రెడ్డి తెలుపగా.. ఎవరెవర్ని తీసుకోవాలనేదానిపై చర్చించినట్టు సమాచారం. జిల్లాలు, సామాజికవర్గం, పార్టీ కోసం పనిచేసిన కొందరి పేర్లు చర్చకు రాగా, త్వరలోనే మరోసారి చర్చిద్దామని సోనియా చెప్పినట్టు తెలిసింది. కొత్త పీసీసీ అధ్యక్షుడి నియామకంపైనా చర్చ జరిగినట్టు సమాచారం. సీఎంగా రెడ్డి వర్గానికి చెందిన రేవంత్‌రెడ్డి ఉండగా, డిప్యూటీ సీఎంగా ఎస్సీ వర్గానికి చెందిన భట్టి విక్రమార్క ఉన్నారు. ఈ నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడిగా బీసీ వర్గానికి అవకాశం ఇచ్చే అంశంపై చర్చ జరిగినట్టు తెలిసింది.

## సిద్దిపేటలో చేతికొచ్చిన ఆయిల్‌పామ్

- కోతకు సిద్ధంగా ఉన్న గెలలు
- నేడు కోత ప్రారంభించనున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు



అక్కెనపల్లిలో గెలలు తీసేందుకు సిద్ధంగా ఉన్న రైతు నాగేందర్ ఆయిల్ పామ్ పంట

నంగునూరు, జూన్ 8 : బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక రాయితీలు ఇచ్చి ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించింది. ఇందులో భాగంగా సిద్దిపేట జిల్లాలో 11 వేల ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. నంగునూరు మండలంలోని నర్మెట గ్రామంలో 65 ఎకరాల్లో రూ.300 కోట్లతో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులకు బీఆర్ఎస్ హయాంలో హరీశ్‌రావు శంకుస్థాపన చేయగా పనులు కొనసాగుతున్నాయి. కాగా, నంగునూరు మండలంలోని అక్కెనపల్లిలో 26 మంది రైతులు 168 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుచేశారు. ముందుగా సాగు చేయడంతో అక్కెనపల్లికి చెందిన నాగేందర్ అనే రైతుకు చెందిన ఆయిల్‌పామ్ తోటలో తొలి గెలలు తీసేందుకు సిద్ధమయ్యాయి. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం తొలి గెలలు తీసే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ ఏడాది డిసెంబర్ వరకు సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో 415 ఎకరాల్లో పంట చేతికి వచ్చే అవకాశం ఉన్నదని అధికారులు తెలిపారు.

# సిద్దాపూర్ రిజర్వాయర్ పూర్తిచేస్తా..

- ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఊరుకోను
- మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి



కోనాపూర్‌లో మాట్లాడుతున్న పోచారం

బాన్సువాడ రూరల్, జూన్ 8: సిద్దాపూర్ రిజర్వాయర్ పూర్తి చేయడమే తన సంకల్పమని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని గట్టుమీది గ్రామాలైన హన్మాజీపేట్, కోనాపూర్, సంగోజీపేట్, కాద్లాపూర్ తదితర గ్రామాలకు సాగునీరు అందించేందుకు సిద్దాపూర్ రిజర్వాయర్ పూర్తి చేస్తానని స్పష్టంచేశారు. బాన్సువాడ మండలం కోనాపూర్‌లో రూ.12 కోట్లతో నిర్మించనున్న గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులకు పోచారం శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ.200 కోట్లతో సిద్దాపూర్ రిజర్వాయర్ పనులు చేపట్టామని, కొందరి వల్ల ప్రస్తుతం పనులు నిలిచిపోయాయని తెలిపారు. పనులు చేపట్టేందుకు కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా రిజర్వాయర్ పనులు పూర్తి చేయడమే తన సంకల్పమని ప్రకటించారు. గతంలో 230 ఉన్న గురుకులాలను 1120కి పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో పని చేశానని, గురుకులాలు, మోడల్ స్కూళ్లు, జూనియర్, డిగ్రీ కాలేజీలతో పాటు నర్సింగ్ కాలేజీ, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల సహా నియోజకవర్గంలో అన్ని రకాల విద్యాలయాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. కేసీఆర్ కృషితో కోనాపూర్- హన్మాజీపేట్ గ్రామాల మధ్య గిరిజన గురుకుల పాఠశాల మంజూరైందని తెలిపారు. విద్యార్థినులకు శాశ్వత భవన నిర్మాణం కోసం రూ.12 కోట్లు మంజూరు చేశామని, పనులను త్వరితగతంగా చేపట్టి విద్యార్థులకు భవనాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. కాగా కోనాపూర్ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని సంగోజీపేట్‌కు చెందిన ఆర్మీ జవాన్ రాసాలం మహేశ్ సన్మానించారు. 'సార్ మీ కృషి, మీ కుమారుడు పోచారం భాస్కర్‌రెడ్డి' సహకారంతో ఆర్మీ జవాన్ ఉద్యోగం సాధించినట్టు పేర్కొన్నాడు.

## సీబీఐటీలో సిబ్బందికి లైంగిక వేధింపులు

మణికొండ, జూన్ 8: గండిపేటలోని చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల (సీబీఐటీ)లో లైంగిక వేధింపులు పెచ్చుమీరుతున్నాయని ఓ మహిళా ప్రొఫెసర్ ఆరోపించారు. ఐక్యూసీ డైరెక్టర్లు సుశాంత్ బాబు, త్రివిక్రమరావు వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ నరసింహకు ఫిర్యాదు చేసినా.. తేలికగా తీసుకున్నారని పేర్కొన్నారు. శనివారం తనను లైంగికంగా వేధించారని మహిళా ప్రొఫెసర్ రోదించారు. విషయం తెలుసుకున్న ఇతర మహిళా ప్రొఫెసర్లు బోధన, బోధనేతర సిబ్బందితో కలిసి ప్రిన్సిపాల్ చాంబర్ ముందు బైఠాయించారు. మహిళా సిబ్బందిని వేధిస్తున్న వారిని తక్షణమే సస్పెండ్ చేయాలని బోధనేతర సిబ్బంది యూనియన్ అధ్యక్షుడు సంజీవ్ డిమాండ్ చేశారు. అకాడమీ డైరెక్టర్‌గా ఉన్న సుశాంత్ బాబు, త్రివిక్రమ్‌రావు, ఇంగ్లిష్ హెచ్‌వోడీ గుప్తా ప్రవీణ్‌ను విధుల నుంచి తొలగించాలన్నారు. కామాంధులపై చట్టపరమైన చర్యలు తీసుకొనేంత వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీబీఐటీలో లైంగిక వేధింపులపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని నార్సింగ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. ఫిర్యాదు అందితే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో అడ్డుకొన్న లారీల వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

# 'ఫ్లైయాష్'కుంభకోణం

మొదటిపేజీ తరువాయి...

శివారులోని కరీంనగర్ రోడ్డు కాకతీయ కాలువ వద్ద ఫ్లైయాష్ తరలిస్తున్న లారీలను పాడి కౌశిక్‌రెడ్డి అడ్డుకున్నారు. అక్కడే మీడియాతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఒక లారీలో 32 టన్నుల బూడిద తరలించాలని, ఇందుకు విరుద్ధంగా 50 నుంచి 65 టన్నుల ఓవర్‌లోడ్ తీసుకెళ్తున్నారని తెలిపారు. నిత్యం రామగుండం ఎన్టీపీసీ నుంచి ఖమ్మంకు 300 లారీల ఫ్లైయాష్ రవాణా అవుతున్నదని పేర్కొన్నారు. 32 టన్నుల బూడిద సామర్థ్యం గల లారీకి కిరాయి రూ.25 వేలు ఉంటుందని, అయితే ఓవర్‌లోడ్‌తో వెళ్తుండటంతో వాహనాలకు కిరాయి తప్పుతుందని తెలిపారు. ఇందులో నిత్యం రూ.50 లక్షలు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ జేబులోకి వెళ్తుండగా ఇప్పటివరకు రూ.100 కోట్ల స్కాం జరిగిందని ఆరోపించారు. అధిక లోడుతో వెళ్తున్న లారీలతో రోడ్లు దెబ్బతినడమేగాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల తుమ్మనపల్లి వద్ద బూడిద కారణంగా టూవీలర్ అదుపు తప్పడంతో కిట్స్ కళాశాల అధ్యాపకుడు మరణించిన విషయాన్ని గుర్తుచేశారు. రవాణాశాఖ అధికారులను లొంగదీసుకొని ఈ తతంగం నడుపుతున్నారని విమర్శించారు. ఇటీవల 11 లారీలను అధికారులకు పట్టించానని, అయితే అందులో రెండు లారీలకు మాత్రమే కేసు రాసి మిగతాని వదిలిపెట్టడంలో గల ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఈ స్కాంలో సీఎం రేవంత్‌కు ముడుపులు అందుతున్నాయని ఆరోపించారు. పొన్నం ప్రభాకర్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బూడిద తరలింపునకు సంబంధించి వే బిల్లులు ఉన్నాయా? అని డ్రైవర్‌ను అడుగగా ఖమ్మంలోని నేషనల్ హైవేకు తీసుకువెళ్తున్నట్టు చిన్న రసీదు తప్ప వేరే కాగితాలు చూపించలేదన్నారు. అక్కడే ఉన్న 45 టన్నుల కెపాసిటీ గల వేబ్రిడ్జి దగ్గర బూడిద లారీని కాంట వేయగా 'జీరో లోడ్' అని చూపిస్తున్నదని, దీన్నిబట్టి చూస్తే సామర్థ్యం కంటే ఎక్కువ బూడిద లారీలో ఉన్నట్టు తెలుస్తున్నదని ఆయన పేర్కొన్నారు.

# కేసీఆర్‌తో బీఆర్ఎస్ నేతల భేటీ

హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధ్యక్షుడు కే చంద్రశేఖర్ రావుతో వివిధ జిల్లాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు శనివారం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో భేటీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో వారి భేటీకి ప్రాధాన్యం నెలకొన్నది. పార్టీ ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు కార్యాచరణపై ఈసందర్భంగా కేసీఆర్ ఆ నేతలతో చర్చించారు. ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో ఓడిన రాకేశ్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. త్వరలో పార్టీ పునర్నిర్మాణం, సంస్థాగతంగా బలోపేతం చేసుకునే అంశాలపై ఈ సందర్భంగా చర్చ జరిగినట్టు తెలిసింది.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం ఎడ్లపల్లిలో ఖాళీ బిందెలతో రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలు

## ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన ఎడ్లపల్లి వాసులు

### విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు

మల్హర్, జూన్ 8 : విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూడు రోజులుగా తాగు నీటికి ఇబ్బంది పడుతున్నామంటూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం ఎడ్లపల్లి వాసులు శనివారం ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. నాలుగురోజుల క్రితం గ్రామంలో ఈదురుగాలులతోపాటు కురిసిన వర్షానికి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, మరమ్మతుకు తీసుకెళ్లిన అధికారులు ఇప్పటివరకు బిగించకపోవడంతో కరెంటు లేక తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు. బోర్ మోటర్, మిషన్ భగీరథ నీరు రాక తాగడానికి, ఇతర అవసరాలు తీర్చుకోవడానికి అవస్థలు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## అంధకారంలో లోహ గ్రామం

### ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయి మూడు రోజులు

### కరెంటు లేక, నీళ్లు రాక ఇబ్బందుల్లో గిరిజనులు

దహెగాం, జూన్ 8 : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగం మండలంలోని ఖర్జీ గ్రామ పంచాయతీ పరిధిలోని లోహ గిరిజన గ్రామం మూడు రోజులుగా అంధకారంలో మగ్గుతున్నది. ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోగా మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆడవిబిడ్డలు నానా అవస్థలు పడుతున్నారు. బోర్లు పని చేయక నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కిలో మీటర్ దూరంలోని పెద్ద వాగుకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. అసలే దట్టమైన అడవుల మధ్య ఉన్న ఈ గ్రామానికి విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో రాత్రిళ్లు భయంభయంగా గడుపుతున్నారు. ఎప్పుడు ఏ వైపు నుంచి వచ్చి జంతువులు దాడి చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



లోహ గ్రామంలో పాడైన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్



గోదావరి నుంచి నీటిని తెచ్చుకుంటున్న ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెం చెలక గ్రామస్థులు

# మంచినీటి కోసం అవస్థలు

- పాడైన మోటర్.. ఐదు రోజులుగా అందని నీరు
- రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లి తెచ్చుకుంటున్న ములుగు జిల్లా టేకులగూడెం చెలక గ్రామస్థులు

వాజేడు, జూన్ 8 : మంచినీటి కోసం ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెం చెలక గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. గ్రామానికి తాగునీటిని అందించే మోటర్ నాలుగైదు రోజులుగా నడవడం లేదు. దీంతో గ్రామస్థులు నీటి కోసం సతమతమవుతున్నారు. తప్పని పరిస్థితుల్లో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గోదావరి నదికి నడిచి వెళ్లి బిందెలు, డబ్బాల్లో నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి బందం రవీందర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా.. మోటర్ పాడైపోవడంతో గోదావరి నీళ్లు రావడం లేదన్నారు. వెంటనే మరమ్మతు చేయించి గోదావరి నీటిని గ్రామస్థులకు అందిస్తామని తెలిపారు.

## బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

### తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘం డిమాండ్

హైదరాబాద్, హిమాయత్‌నగర్, జూన్ 8: రాష్ట్రంలో బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘం డిమాండ్ చేసింది. శనివారం హైదరాబాద్‌లో సంఘం అధ్యక్షుడు రాజేశ్వర శర్మ, ప్రధాన కార్యదర్శి ఉప్పల బాలసుబ్రహ్మణ్యం విలేకరులతో మాట్లాడుతూ 'బ్రాహ్మణుల జనాభా లెక్కలను తేల్చాలి. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి. కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్స్ పోస్టుల్లో బ్రాహ్మణులనే నియమించాలి. బ్రాహ్మణులపై జరుగుతున్న దాడులను అడ్డుకోవడానికి ప్రత్యేక చట్టం తీసుకురావాలి. దూప, దీప, నైవేద్యం పథకాన్ని ప్రక్షాళన చేయాలి' అని కోరారు. విలేకరుల సమావేశంలో సంఘం మహిళా విభాగం కన్వీనర్ అర్పిత, నాయకులు చక్రవర్తిశర్మ, వేమవరపు వెంకటరమణ, చిన్నయ్య శర్మ, పాపయ్య శర్మ, కేశవనాథ శర్మ, ప్రకాశ్‌శర్మ పాల్గొన్నారు.

# బడి బయట భావితరం!

- రాష్ట్రంలో 16,683 మంది డ్రాపౌట్
- జోగుళాంబ గద్వాల జిల్లాలో అత్యధికం
- 11వేల మంది ఎలిమెంటరీ దాటలే
- సెకండరీ విద్యలోనూ 5వేల మంది డ్రాప్
- విద్యాశాఖ సర్వేలో విస్తుపోయే నిజాలు
- కుటుంబం నుంచి లభించని ప్రోత్సాహం
- బతుకుదెరువుకోసం వలసలూ కారణం

హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ) : పిల్లల చదువుకు కుటుంబం నుంచి లభించని ప్రోత్సాహం, బతుకుదెరువు కోసం వలసలు పోవడం కారణంగా భావిభారతం బడి బయటనే మగ్గుతున్నది. రాష్ట్రంలో 'ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్' మొత్తం 16,683 మంది ఉన్నట్లు తేలడం ఆందోళన కలిగిస్తున్నది. 2024-25 విద్యా సంవత్సరానికిగాను విద్యాశాఖ చేసిన సర్వేలో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. ఎలిమెంటరీ (1-8వ తరగతి) స్థాయి పూర్తిచేయనివారు అత్యధికంగా 11,405, సెకండరీ స్థాయి (9, 10 తరగతులు) పూర్తిచేయని వారు 5,278మంది పిల్లలుండటం గమనార్హం. జిల్లాలవారీగా తీసుకుంటే జోగులాంబ గద్వాల జిల్లాలో అత్యధికంగా డ్రాపౌట్స్ ఉన్నారు. ప్రతి జిల్లాలోనూ వందల సంఖ్యలో పిల్లలు బడికి దూరంగా ఉన్నారు. 6 -14 ఏండ్ల వయస్సువారు పాఠశాల్లో నమోదై ఉండి ఎలిమెంటరీ విద్య పూర్తిచేయకుండా మధ్యలో మానేస్తే 'ఔట్ ఆఫ్ ది స్కూల్ చిల్డ్రన్'గానే పరిగణిస్తారు. విద్యార్థి వరుసగా నెలకు పైగా డుమ్మా కొట్టినా ఇలాగే లెక్కిస్తారు. ఇటీవలీ కాలంలో పాఠశాల విద్యాశాఖ రాష్ట్రంలో 'ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్'పై సర్వే చేసింది. ఇంటింటికి వెళ్లి పిల్లల వివరాలను సేకరించింది. ఆ వివరాలను కేంద్ర విద్యాశాఖకు చెందిన 'ప్రబంధ్ పోర్టల్'లో నమోదు చేసింది. చదువు కొనసాగేందుకు కుటుంబం నుంచి ప్రోత్సాహం లభించకపోవటం, కుటుంబాలు వలస పోవడం తదితర కారణాలతో విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నట్టు విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

### కొన్ని జిల్లాల్లో ఇదీ పరిస్థితి

| జిల్లా | ఎలిమెంటరీ | సెకండరీ | మొత్తం |
|---|---|---|---|
| జోగుళాంబ | 956 | 265 | 1,221 |
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | 659 | 303 | 962 |
| నారాయణపేట | 361 | 289 | 650 |
| జనగామ | 133 | 130 | 263 |
| సిద్దిపేట | 458 | 398 | 856 |
| కామారెడ్డి | 591 | 348 | 938 |
| రంగారెడ్డి | 550 | 163 | 713 |
| మేడ్చల్ మల్కాజిగిరి | 440 | 20 | 460 |
| ఖమ్మం | 456 | 377 | 833 |
| సంగారెడ్డి | 585 | 107 | 692 |
| ఆదిలాబాద్ | 563 | 121 | 684 |
| హైదరాబాద్ | 553 | 21 | 574 |
| భద్రాద్రి కొత్తగూడెం | 429 | 143 | 572 |

- వినూత్నంగా సర్కారు బడి పోస్టర్




మంచిర్యాల జిల్లా భీమారం మండలం కొత్తగూడెం మండల పరిషత్ పాఠశాల పోస్టర్‌ను కార్పొరేట్ స్థాయిలో రూపొందించి అందరిని ఆకట్టుకుంటున్నారు. ప్రధానోపాధ్యాయుడు జీ సంతోష్‌కుమార్ అడ్మిషన్లు ప్రారంభమైనట్టు వినూత్నంగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఉచితంగా బుక్స్, యూనిఫామ్స్, క్వాలిటీ ఎడ్యుకేషన్, డిజిటల్ క్లాస్ రూమ్, ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వంటి సదుపాయాలు ఉన్నట్టు అందులో పేర్కొన్నారు. ఈ పోస్టర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. కాగా, నిరుడు 'మన ఊరు - మన బడి' కార్యక్రమంలో భాగంగా ఈ పాఠశాలను అందంగా తీర్చిదిద్దారు.

- భీమారం

## మోదీపై బీజేపీలోనే వ్యతిరేకత

- గతంకంటే మెజార్టీ 3 లక్షలు తగ్గింది
- మోదీని, బీజేపీని ప్రజలు నమ్మలేదు
- తెలంగాణ పీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్

హైదరాబాద్, జూన్ 8(నమస్తే తెలంగాణ): నరేంద్రమోదీపై బీజేపీలోనే తీవ్ర వ్యతిరేకత ఉన్నదని, ఆయనను ఎప్పుడు తప్పిస్తారో తెలియని పరిస్థితి నెలకొన్నదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ తెలిపారు. ఆ ముప్పు నుంచి తప్పించుకునేందుకే హడావుడిగా పదవీ ప్రమాణ స్వీకారం చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ప్రజలు మోదీని, బీజేపీని నమ్మలేదని చెప్పారు. అందుకే బీజేపీకి సీట్లు తగ్గాయని, మోదీకి గతంకంటే 3 లక్షల మెజార్టీ తగ్గిందని తెలిపారు. మోదీకి 2019లో 4.71 లక్షల మెజార్టీ రాగా, ఈ ఎన్నికల్లో 1.71 లక్షలకు పడిపోయిందని చెప్పారు. అయోధ్య ప్రాంతమున్న ఫైజాబాద్‌లో బీజేపీ ఓడిందని, అయినా మోదీ ఆత్మవిమర్శ చేసుకోవడం లేదని విమర్శించారు.

## విత్తనాల బ్లాక్ మార్కెట్‌తో మాకు ప్రమేయం లేదు

### సస్పెన్షన్ వేటుపడిన ఏఈవోల వివరణ

తొర్రూరు, జూన్ 8: విత్తనాల బ్లాక్ మార్కెట్‌తో తమకు ప్రమేయం లేదని సస్పెండైన ఏఈవోలు స్పష్టం చేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలానికి కేటాయించిన పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించి విక్రయించిన ఘటనలో మండల వ్యవసాయ అధికారితోపాటు ముగ్గురు ఏఈవోలను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సదరు ఏఈవోలు ఈ దందాతో తమకు ప్రమేయం లేదని కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం తొర్రూరులో హరిపిరాల ఏఈవో సీహెచ్ అరవింద్, అమ్మాపురం ఏఈవో దీపిక, వెలికట్ట క్లస్టర్ ఏఈవో జమున మాట్లాడుతూ.. మండల వ్యవసాయ అధికారి కుమార్‌యాదవ్ మే 22న ఉదయం వాట్సాప్ గ్రూప్‌లో విత్తన కేటాయింపుల గురించి వివరాలు పెట్టినట్టు తెలిపారు. ఈ సమాచారం అందించి విక్రయ కేంద్రం నుంచి కేటాయింపులు చేసేలోపే, తమ ప్రమేయం లేకుండా ఆన్‌లైన్‌లోనే రైతుల పేరిట పర్మిట్లు జారీ చేశారన్నారు. తప్పుడు నివేదకతో తమను సస్పెండ్ చేయడం బాధాకరమని వారు పేర్కొన్నారు.

